

లోక్‌సభ పోరుకు హస్తం నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, వరంగల్ లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసేందుకు పెద్దఎత్తున సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నేతలు కూడా హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండుస్థానాల్లో ఏకంగా 90 మంది బరిలో ఉండేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మానుకోటకు 48 మంది, వరంగల్‌కు 42మంది దరఖాస్తు చేసుకోవడంతో పోటీ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా వుండగా, ప్రభుత్వ ఉద్యోగులు సైతం పోటీకి సై అంటున్నారు. అయితే దరఖాస్తుల పరిశీలనకు ఏఐసీసీ ప్రదేశ్ ఎన్నికల కమిటీని నియమించింది. ఇందులోని సభ్యులు రెండు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఈ 90మందిలో ఎవరికి టికెట్ దక్కుతుందో చూడాలి మరీ..

- జనరల్ స్థానాల కంటే ఈ రెండు రిజర్వుడు స్థానాలకు భారీ డిమాండ్
- సీనియర్ నేతలతో పాటు అనేక మంది పోటాపోటీ
- బరిలో దిగేందుకు సై అంటున్న పలువురు ఉద్యోగులు
- అధిష్ఠానం ఆశీస్సుల కోసం ఢిల్లీ, హైదరాబాద్‌కు పరుగులు

కాంగ్రెస్‌లో టికెట్ రేస్!



వరంగల్ ఎంపీ స్థానానికి 42, మహబూబాబాద్‌కు 48 మంది దరఖాస్తు

వరంగల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లోని ఆశావహులు రాబోయే ఎంపీ ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 17ఎంపీ స్థానాలకు 309 దరఖాస్తులు రాగా, వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ ఎంపీ సీట్ల కోసం 90మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వుడైన ఈ రెండు స్థానాలకు ఇంత పెద్దమొత్తంలో దరఖాస్తులు రావటంపట్ల పార్టీలో ఆసక్తికర చర్చ జరుగుతుంది. సీనియర్ నేతలతో పాటు కొత్తగా టికెట్ ఆశించే వారిలో ప్రభుత్వ ఉద్యోగులూ ఉన్నారు. వారంతా పార్టీలో ఉన్న తమ గాడ్‌ఫాదర్ల ద్వారా టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థిత్వాలు ఎవరికి దక్కుతాయోనన్న ఉత్కంఠ కనిపిస్తోంది.

రెండు స్థానాలపై ఆశావహుల ఆశలు

కాంగ్రెస్ ఎంపీ టికెట్లకు భారీగా డిమాండ్ ఉండగా.. ఎస్టీ రిజర్వుడైన మహబూబాబాద్, ఎస్సీ రిజర్వుడ్ అయిన వరంగల్ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆశావహుల నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులు అందాయి. రాజకీయంగా చైతన్యవంతమైన ఓరుగల్లు నుంచి పొలిటికల్ ఎంట్రీ ఇవ్వాలని పలువురు నేతలు, కొత్తగా రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న వారు తహతహలాడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మరోసారి మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ఏర్పడింది. 2009లో బలరామ్‌నాయక్ ఎంపీగా గెలిచి, మన్మోహన్‌సింగ్ కెబినేట్‌లో కేంద్ర సహాయ మంత్రిగా పని చేశారు. ఆ తరువాత 2014, 2019 ఎన్నికల్లో రెండు పర్యాయాలు బీఆర్ఎస్ అభ్యర్థులు ఎంపీలుగా గెలిచారు. వరంగల్ పార్లమెంట్ 1952లో ఏర్పడింది.



అయితే 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సిరిసిల్ల రాజయ్య విజయం సాధించగా, 2014లో బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి విజయం సాధించగా, 2016లో జరిగిన ఉప ఎన్నికతో పాటు 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దయాకర్ విజయం సాధించారు. అప్పట్లో బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో వరుసగా రెండు పర్యాయాలు ఆ పార్టీకి అవకాశం వచ్చింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటమే కాకుండా ఈ పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఓట్లు రెట్టింపు అయ్యాయి. దీంతో కాంగ్రెస్ టికెట్ కోసం భారీగా పోటీ నెలకొంది. 2009 నాటి ఫలితాలను పునరావృతం చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేస్తోంది.

రెండు సీట్లు.. 90మంది దరఖాస్తులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా, 90మంది ఆశావహులు దరఖాస్తులు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17పార్లమెంట్ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. వీటిలో ఎస్టీ రిజర్వుడు స్థానమైన మహబూబాబాద్‌కు అత్యధికంగా 48మంది టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వరంగల్ ఎంపీ టికెట్ కోసం 42మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధిక దరఖాస్తులో మొదటి రెండు స్థానాలు ఉమ్మడి జిల్లా ఎంపీ స్థానాలకే దక్కింది. వరంగల్ పార్లమెంట్ స్థానానికి ప్రధానంగా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతో పాటు గత ఎన్నికల్లో పోటి చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్య, సర్వే సత్యనారాయణ, అద్దంకి దయాకర్, డాక్టర్ రాగమల్ల పరమేశ్వర్‌తో పాటు ఉమ్మడి వరంగల్ రిజిస్ట్రార్ హరికోట్ల రవి తదితరులు ఎంపీ టికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మహబూబాబాద్ టికెట్ కోసం ప్రధానంగా మాజీ కేంద్ర మంత్రి బలరామ్‌నాయక్‌తో పాటు బెల్లయ్య నాయక్, మోహన్‌లాల్, నెహ్రూనాయక్, నాగరాజు, సాంబయ్య తదితరులు టికెట్ రేసులో ఉన్నారు. వీరితో రెండు ఎంపీ స్థానాల కోసం సీనియర్ నేతలు, కొత్తగా పార్టీలో చేరి టికెట్ కోసం చాల మంది అశావహులు ప్రయత్నిస్తున్నారు.

పోటీకి పలువురు ఉద్యోగులు సై..

కాంగ్రెస్ టికెట్ ఆశించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండగా.. సీనియర్, జూనియర్ నేతలతో పాటు పలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు కూడా రాజకీయంగా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. పలువురు పోటీకి సై అంటుండం

మిగతా 7వ పేజీలో..

ఐదుగురి పేర్లతో స్క్రీనింగ్

రాష్ట్రంలో ఎంపీ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఏఐసీసీ ప్రదేశ్ ఎన్నికల కమిటీని నియమించింది. స్ర్కీనింగ్ కమిటీ చైర్మన్ హరీ‌ష్‌చౌదరి, జిగ్నే‌ష్‌మేవాని, విశ్వజిత్ కదమ్‌లతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గురువారం నుంచి 15వ తేదీలోపు తెలంగాణలో ఎంపీ టికెట్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్నారు. మొత్తం 17 ఎంపీ స్థానాల నుంచి వచ్చిన మొత్తం 209 దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురు నుంచి ఐదుగురి పేర్లతో తొలి జాబితా తయారు చేయనున్నారు. తక్కువ దరఖాస్తుల వచ్చిన నియోజకవర్గాల్లో ముగ్గురు, ఎక్కువ దరఖాస్తులు వచ్చిన చోట నలుగురు, ఐదుగురితో జాబితా సిద్ధం చేయనున్నారు. వరంగల్ నుంచి 42, మహబూబాబాద్ నుంచి 48 దరఖాస్తులు రావటంతో ఒక్కో స్థానం నుంచి ఐదుగురితో జాబితా తయారు చేసి ఏఐసీసీకి పంపనున్నారు. ఈ ఐదుగురిలో చోటు దక్కిన వారి నుంచి ఒక్కరి టికెట్ ఖరారు చేసే బాధ్యతను ఏఐసీసీకే అప్పగించనున్నారు. దీంతో స్క్రీనింగ్ కమిటీ ఫైనల్ చేసే ఐదుగురిలో తమ పేరు ఉంటుందా అనే ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. 18వ తేదీ తరువాత అభ్యర్థులను ప్రకటించే అవకాశముందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. దీంతో 90 మంది ఆశావహుల్లో టికెట్ దక్కే ఆ ఇద్దరు ఎవరో అనేది క్యాడర్‌లో ఉత్కంఠ రేపుతోంది.

ప్రభుత్వ స్థలాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి) : వివిధ అభివృద్ధి పథకాల కింద అర్హులైన వారిని గుర్తించి, అందజేసిన ప్రభుత్వ స్థలాలను విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ హెచ్చరించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలుసమస్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ గార్ల, బయ్యారం మండలాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధితాధికారులు తక్షణమే స్పందిస్తూ.. పరిష్కరించాలన్నారు. వివిధ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన భూమిని విక్రయించినా, ఆక్రమించినా చర్యలు తప్పవన్నారు. అలాగే కోర్టుద్వారా పరిష్కారమైన గిరిజన రైతుల భూముల వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. దీంతో రైతుబంధు, రైతుబీమా పథకాలు పొందేందుకు అర్హత ఉంటుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్ సింగ్

భద్రాచలం ఐటీడీఏ పీడీ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పో, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకుడు ఎర్రయ్య, మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు, గార్ల, బయ్యారం మండలాల తహసీల్దార్లు స్వాతి బిందు, ఇమ్మానియేల్, ఎంపీడీవోలు రవీందర్, సత్య నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు టీ ప్రైడ్ రుణాల రాయితీ మంజూరు..

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో టీ ప్రైడ్ రుణాల రాయితీని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మంజూరు చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో టీప్రైడ్ ద్వారా ఎస్టీలకు 15 యూనిట్లు, ఎస్సీలకు 2 యూనిట్లు మొత్తంగా 17 యూనిట్లకు రాయితీని మంజూరు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళిత, గిరిజన కుటుంబాల్లో ఆర్థికాభివృద్ధి పెంచేందుకు యూనిట్లు ఎంతగానో దోహదపడు తాయని ఈ అవకాశాలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని కలెక్టర్ అన్నారు.

ఎస్టీ కేటగిరిలో 15 యూనిట్లకు గాను రూ.43,39,698, ఎస్సీ కేటగిరిలో 2 యూనిట్లకు గాను రూ.5,34,718 వెరసి మొత్తంగా రూ.48,74,416 రాయితీని అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ అధికారి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు ఎర్రయ్య, బాలరాజు, నరేష్, సత్యనారాయణమూర్తి, వెంకన్న, తస్లీమా మహ్మద్, రమణ పాల్గొన్నారు.

జిల్లాలో 4,80,236 మంది ఓటర్లు

- రెండు నెలల్లో కొత్తగా నమోదైన 7,630 మంది
- మానుకోటలో 4,503, డోర్నకల్‌లో 3,127..

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 8 : మహబూబాబాద్ జిల్లాలోనిపూర్తిస్థాయి నియోజకవర్గాలు డోర్నకల్, మానుకోట అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 4,80,236 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,35,557 మంది పురుషులు 2,44,626 స్ర్తీలు, 53 మంది ఇతరులున్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు గురువారం ఎన్నికల అధికారులు ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్‌ను విడుదల చేశారు.



మహబూబాబాద్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

2023 నవంబరు 30 అసెంబ్లీ ఎన్నికల సమయం నాటికి రెండు నియోజకవర్గాల పరిధిలో 4,72,606 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 4,80,236కు చేరుకుంది. శాసనసభ ఎన్నికల తర్వాత 2024 జనవరి 1 వరకు 18 ఏళ్ల నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు జిల్లాలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించడంతో పెద్దఎత్తున యువత కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. రెండునెలల కాలంలోనే రెండు నియోజకవర్గాల పరిధిలో దాదాపుగా 7,630 మంది ఓటర్లు పెరగడం విశేషం. ఇక నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే మహబూబాబాద్ నియోజకవర్గంలో గతంలో 2,53,342 మంది ఓటర్లుండగా, ప్రస్తుతం 2,57,845 మందికి చేరుకున్నారు దీంతో ఇక్కడ 4,503 మంది పెరిగారు. డోర్నకల్ నియోజకవర్గ పరిధిలో గతంలో 2,19,264 మంది ఉండగా ప్రస్తుతం 2,22,391 మందికి చేరుకోగా ఈ నియోజకవర్గంలో 3,127 మంది ఓటర్లు పెరిగారు.

డోర్నకల్ నియోజకవర్గం ఓటర్లు..

మండలం	పీఎస్	పురుషులు	స్ర్తీలు	ఇతరులు	మొత్తం
చిన్నగూడూరు	15	6396	6469	00	12865
దంతాలపల్లి	29	12012	12583	01	24596
డోర్నకల్	41	19175	20127	03	39305
కురవి	56	20598	21769	00	42367
మరిపెడ	66	29329	30017	00	59346
నర్సింహులపేట	26	11975	12439	02	24416
సీరోలు	23	9655	9840	01	19496
మొత్తం	256	1,09,140	1,13,244	07	2,22,391



మహబూబాబాద్ నియోజకవర్గం ఓటర్లు..

మండలం	పీఎస్	పురుషులు	స్ర్తీలు	ఇతరులు	మొత్తం
గూడూరు	51	23396	24140	02	47538
ఇనుగుర్తి	22	8849	9011	01	17861
కేసముద్రం	51	23560	24005	00	47565
మహ-బాద్	113	50008	53213	41	103262
నెల్లికుదురు	44	19773	20152	02	39957
దంతాలపల్లి(పాక్షిక)	02	831	831	00	1662
మొత్తం	283	1,26,417	1,31,382	46	2,57,845

16న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి8 : జిల్లా ప్రజాపరిషత్ స్థాయీసంఘాల సమావేశాన్ని ఈనెల 16న ఉదయం 10.30 గంటలకు జడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవోరమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ స్థాయీ సంఘం (ప్రణాళిక, ఆర్థిక పనులు), 2వ స్థాయీ సంఘం (గ్రామీణాభివృద్ధి), 3వ స్థాయీ సంఘం (వ్యవసాయం), 4వ స్థాయీ సంఘం (విద్య, వైద్య సేవలు), 5వ స్థాయీ సంఘం (మహిళ సంక్షేమం), 6వ స్థాయీ సంఘం (సాంఘిక సంక్షేమం), 7వ సాయీ సంఘం (పనుల అభివృద్ధి)పై చర్చించనున్నట్లు చెప్పారు.



మానుకోట ఆర్టీసీ కాలనీలో లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది

సర్వేలు షురూ..

- 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు సమాచార సేకరణ
- లబ్ధిదారుల ఎంపికకు క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటన
- 'ప్రజాపాలన' యాప్‌లో నమోదు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 8 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, రూ.500లకు గ్యాస్ సిలిండర్ పంపిణీ అమలు చేసేందుకు లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్‌లో ఉచిత కరెంట్, గ్యాస్ సిలిండర్ సబ్సిడీని అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో అధికారులు ఆయా పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు జిల్లా వ్యాప్తంగా సర్వేలకు శ్రీకారం చుట్టారు. సంవత్సర కాలంలో 2400 యూనిట్లు వాడుకున్న గృహయజమానుల జాబితాను ఇప్పటికే విద్యుత్ అధికారులు సిద్ధం చేశారు. ప్రజాపాలన గ్రామసభల్లో ఈ గ్యారెంటీలకు చేసుకున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేశారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి విద్యుత్ బిల్లుకొట్టి, గృహయాజమానులు, ఇంట్లో అద్దెకుంటున్న వారి తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు నెంబర్, సెల్ నెంబర్‌లను సేకరిస్తున్నారు. మరోపక్క రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం అమలు కోసం గురువారం నుంచి సర్వే ఆరంభించారు. మునిసిపాలిటీ పరిధిలో, గ్రామాల్లో సిబ్బంది, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు ఇంటింటి సర్వే చేపట్టి, అందుకు సంబంధించిన వివరాలు ప్రజాపాలన యాప్‌లో పొందుపరుస్తున్నారు. రేషన్‌కార్డు, గ్యాస్ కంపెనీ పేరు, వినియోగదారుడి నెంబర్‌ను ప్రజాపాలనలో యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఏమైనా తప్పు లుంటే వాటిని సరిచేస్తూ యాప్‌లో నమోదు చేస్తున్నారు. రెండుగ్యారెంటీల పథకాల అమలుకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వేలు చేపట్టి సమాచారాన్ని సేకరిస్తున్నారు. సర్వేలు పూర్తయ్యాక తెలంగాణ ప్రభుత్వానికి వివరాలను నివేదించనున్నారు.



మేడారం ఈవో కార్యాలయం ఉన్న దేవాదాయ శాఖ ధార్మిక భవనం

నిర్వహణ బహుదూరం!

- హనుమకొండలో మేడారం ఈవో కార్యాలయం
- జాతర కార్యకలాపాలన్నీ నగరం నుంచే..
- ప్రతీ చిన్న పనికి 130 కి.మీ దూరం వెళ్లాల్సిందే..
- ఇబ్బందులు పడుతున్న భక్తులు, పూజారులు



హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోకెల్లా అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారంలో దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి కార్యాలయం లేకపోవడం గమనార్హం. సమ్మక్క-సారలమ్మల జాతర వ్యవహారాలను చూసే అత్యంత ముఖ్యమైన కార్యనిర్వహణాధికారి (ఈవో) కార్యాలయం మేడారానికి 130 కి.మీ. దూరంలో ఉన్న హనుమకొండలో ఉంది. సాధారణంగా ఆలయాల ఈవో ఆఫీసులు వాటి ప్రాంగణాల్లోనే ఉంటాయి. మేడారం విషయంలో మాత్రం ఇందుకు భిన్నం. అక్కడ జాతర.. ఎక్కడో ఆఫీసు అన్నచందంగా ఉంది. దీంతో జాతర సందర్భంగా పూజారులు, అధికారులు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశాన్ని పూజారులు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులున్నాయి.

హనుమకొండలో ఈవో ఆఫీసు

మేడారం జాతర నిర్వహణ విషయంలో దేవాదాయ శాఖ అధికారులకు ఎక్కువ బాధ్యతలు ఉంటాయి. జాతర నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుండాలి. పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలి. జాతరలో కీలక భూమిక పోషించే పూజారులకు నిత్యం అందుబాటులో ఉండాలి. ఈవో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా మేడారానికి 130 కి.మీ.దూరంలో వరంగల్‌లోని పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా గల ధార్మిక భవనంలో ఈవో కార్యాలయం కొనసాగుతోంది. పూజారులకు ఏ సమస్య వచ్చినా, ఏదీ కావాలన్నా, ఏ అనుమతి పొందాలన్నా, ఏదైనా అంశంపై

మిగతా 7వ పేజీలో..

గవర్నర్‌కు ఆహ్వానం



మేడారంలో ఈ నెల 21వతేదీ నుంచి 24వ వరకు జరిగే సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు రావాలంటూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్ర్తీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆహ్వానించారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీతక్క ప్రత్యేకంగా అమ్మవార్ల గద్దెల ప్రతిమలు, పసుపు, కుంకుమ భరిణలతో తయారుచేయించిన ఆహ్వానపత్రికతో పాటు చీరను అందించారు. సీతక్క వెంట కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళిరెడ్డి ఉన్నారు. ఇక ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి కూడా సీతక్క మేడారం వడ్డెలతో(పూజారులు) కలిసి ఆహ్వానం అందించగా ఆయన 23న వనదేవతల దర్శనానికి రానున్నారు.

- మేడారం

డిప్యూటేషన్లు రద్దు

- జిల్లాలో యథాస్థానాలకు వైద్యులు
- నేటి నుంచి విధులకు హాజరుకానున్న ఉద్యోగులు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 8 : జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు డిప్యూటేషన్‌ల రద్దుతో యథాస్థానాలకు తిరిగి చేరుతున్నారు. రాష్ట్రప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్‌లపై పనిచేస్తున్న అధికారులు గత కొన్నేళ్లుగా వివిధ జిల్లాలో పాతుకు పోయారని, వారి వివరాలను గురువారం సాయంత్రం లోగా పోస్టుల్లో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న వైద్య ఉద్యోగులు వివరాలను సేకరించారు. ఇతర జిల్లాలో 9 మంది డిప్యూటేషన్‌లపై విధులు నిర్వహిస్తుండగా, మహబూబాబాద్ జిల్లాలో మాత్రం ఏకంగా 35 మంది విధులు నిర్వహిస్తున్నారు. వెరసి 44 మంది వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సేకరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వివిధ కారణాల చేత డిప్యూటేషన్‌లపై వారి అనుకూలతలను బట్టి పని చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం డిప్యూటేషన్‌లను రద్దు చేయడంతో ఎక్కడి వారే అక్కడ శుక్రవారం నుంచి యథాస్థానాల్లో విధులకు హాజరు కానున్నారు.

20 ఏళ్లుగా జిల్లాలోనే..

వైద్య, ఆరోగ్యశాఖలో ఓ అధికారి 2004 నుంచి ఇప్పటి వరకు మహబూబాబాద్ జిల్లాలోనే మకాం వేశారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా రాష్ట్రప్రభుత్వం డిప్యూటేషన్‌లపై ఏ ఒక్క అధికారి పని చేయకూడదని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే! అయితే ఓ అధికారి మాత్రం జిల్లాలో మెడికల్ ఆఫీసర్ నుంచి మొదలుకుని జిల్లాస్థాయి అధికారి వరకు ఏకంగా 20 సంవత్సరాలుగా జిల్లాలోనే పాతుకుపోయారు. కాగా, డిప్యూటేషన్‌ల రద్దుతోఈ అధికారి ఈసా రైనా జిల్లా దాటి వెళ్తారా.! లేదా? జిల్లాలోనే కొనసాగుతారా అనే అంశంపై వైద్య, ఆరోగ్యశాఖలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఈ దిశగా చర్యలు తీసుకుంటారో.. లేదోనన్న చర్చ కూడా కొనసాగుతోంది.

ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 8 : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ మూడు రోజులు సెలవులను ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అమావాస్య మార్కెట్‌కు సెలవు, శనివారం వారంతపు యార్డు సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉందన్నారు. సోమవారం నుంచి మార్కెట్లో క్రయ విక్రయాలు యథావిధిగా సాగుతాయని పేర్కొన్నారు.



ఢిల్లీలో జరిగిన స్మార్ట్‌సిటీ చాలెంజ్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

స్మార్ట్‌సిటీ చాలెంజ్‌లో కమిషనర్ ప్రజంటేషన్

- జ్యూరీ ఇంటర్వ్యూలకు ఎంపికపై ఉత్కంఠ
- ఎంపికైతే నగరానికి రూ.135 కోట్లు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 8: ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్‌లో నిర్వహించిన సిటీ ఇన్వెస్ట్‌మెంట్ టూ ఇన్నోవేటివ్ అండ్ సస్టైన్ (సీఐటీఐఐఎస్) స్మార్ట్‌సిటీ 2.0 చాలెంజ్ జరిగింది. తొలి దశలో ఎంపికైన దేశంలోని 84 నగరాలు చాలెంజ్‌లో పాల్గొన్నాయి. కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఛాలెంజ్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొని వరంగల్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌పై ప్రజెంటేషన్ ఇచ్చారు. స్మార్ట్ సిటీ కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులు, మారిన నగర రూపురేఖలు, భవిష్యత్తులో నగర అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. రాష్ట్రంలో వరంగల్ రెండో అతిపెద్ద నగరం, చారిత్రక నేపథ్యం, హైదరాబాద్ తరువాత అభివృద్ధి చెందుతున్న తీరు, స్మార్ట్‌సిటీ చాలెంజ్‌కు ఎంపికైన వివరాలను కమిషనర్ ప్రజెంట్ చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య నిర్వహణ, బయో మైనింగ్, ఎఫ్ఎస్‌టీ, ఎస్‌టీపీల నిర్మాణంలో వరంగల్ నగరం ఇతర దేశాలకే ఆదర్శంగా నిలిచిన పరిణామాలను తెలియచేశారు. ఈ పోటీలో కమిషనర్‌తో పాటు వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, బల్దియా సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్ పాల్గొన్నారు.

ఎంపికైతే భారీగా అభివృద్ధి నిధులు

తొలి దశలో ఎంపికైన 84 నగరాలు ఢిల్లీలో జరిగిన చాలెంజ్‌లో పాల్గొనగా వీటినుంచి 18నగరాలను జ్యూరీ ఇంటర్వ్యూలకు కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండర్ అర్బన్ ఎఫైర్స్ ఎంపిక చేస్తుంది. త్వరలో ఈ వివరాలను వెల్లడిస్తారు. 18నగరాల్లో వరంగల్ నగరం ఒకటిగా ఎంపికైతే కేంద్రం రూ.135 కోట్లను నగరాభివృద్ధి కోసం విడుదల చేస్తుంది. ఈక్రమంలో జ్యూరీ ఇంటర్వ్యూ, నగర ఎంపిక అంశాలపై ఉత్కంఠ నెలకొంది. నగరం తప్పక ఎంపికవుతుందనే ఆశాభావాన్ని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వ్యక్తం చేశారు.



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన అభినవ్ భాస్కర్

బీజేపీలో చేరిన అభినవ్‌భాస్కర్

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 8: బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన 60వ డివిజన్ కార్పొరేటర్, మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ తనయుడు దాస్యం అభినవ్ భాస్కర్ బీజేపీలో చేరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, డి.కె.అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సమక్షంలో అభినవ్‌భాస్కర్ బీజేపీలో చేరారు. బీజేపీ కండువా కప్పి అభినవ్‌భాస్కర్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన అభినవ్‌భాస్కర్ ఆ పార్టీ జాతీయ నేతలు బీ.ఎల్.సంతోష్, సునీల్ బన్సల్, తరుణ్‌చుగ్, ఎంపీ అరవింద్, చంద్రశేఖర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా అభినవ్ భాస్కర్ పార్టీ మారడం, బీజేపీలో చేరడం వెనుక ఆ పార్టీ జాతీయ నేత ఈటల రాజేందర్ చక్రం తిప్పినట్లు సమాచారం. ప్రస్తుతం పార్టీలో సముచిత స్థానం కల్పించడంతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచే అవకాశం ఇస్తామనే హామీ బీజేపీ నుంచి తీసుకుని అభినవ్‌భాస్కర్ పార్టీ మారినట్లు పార్టీ వర్గాల సమాచారం.

రుణం వస్తుందని నమ్మించి మోసం

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 8: ఫేస్‌బుక్‌లో పరిచయమై లోన్ వస్తుందని చెప్పడంతో నమ్మి మోసపోయిన ఘటన హనుమకొండ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ మచిలీబజార్‌కు చెందిన షేక్ మంజోరీలహిర్ అనే వ్యక్తికి ఇటీవల ఫేస్‌బుక్‌లో గుర్తి తెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. ఎలాంటి ఆధారాలు లేకుండానే లోన్ వస్తుందని చెప్పడంతో నమ్మి ఇంకా పరిచయం పెంచుకున్నాడు. ముందుగా ధన్‌లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని గుర్తు తెలియని వ్యక్తి నమ్మించాడు. పూర్తి వివరాలు కావాలని కోరడంతో ఆధార్ కార్డు, ఫొటోలు పంపించాడు. లోన్ పొందాలంటే ముందుగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని క్యూఆర్ కోడ్‌ను పంపించాడు. స్కాన్ చేయడంతో బ్యాంకు నుంచి రూ.25వేల నగదు డ్రా అయినట్టు గుర్తించాడు. 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ఉద్యోగం పేరుతో రూ.1.18 లక్షలకు టోకరా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 8: ఆల్‌లైన్‌లో కార్లు బుక్ చేస్తే కమీషన్ దండిగా వస్తుందని చెప్పడంతో ఒకరు నమ్మి మోసపోయిన ఘటన హనుమకొండ రెడ్డికాలనీలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డికాలనికి చెందిన పిల్లలమర్రి శ్రవన్ అనే వ్యక్తి గూగుల్‌లో వెతుకుతుండగా పార్ట్‌టైమ్ జాబ్ అని వచ్చింది. దీనిలో వెతకగా ఒక కంపెనీలో ఉద్యోగం ఖాళీగా ఉందని, ప్రతీరోజు సెల్‌ఫోన్‌లో కార్లు బుక్ చేస్తే నెలకు సరిపడా డబ్బులు వస్తాయని చాటింగ్ ద్వారా తెలుసుకున్నాడు. వారు ఆన్‌లైన్‌లో శ్రవన్‌కు గుర్తింపు కార్డు జారీ చేసి రోజుకు 30 కార్లు బుక్ చేయాలని చెప్పారు. దీంతో రోజుకు 30 కార్లు వారు పంపిన ఫేక్ అడ్రస్‌లకు బుక్ చేస్తున్నాడు. కమీషన్ డబ్బులు ఇవ్వాలని శ్రవన్ కోరడంతో డబ్బులు పొందేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తీసుకోవాలని చెప్పారు. వారు చెప్పిన ప్రకారం స్కాన్ చేయడంతో ముందుగా రూ.10వేలు శ్రవన్ బ్యాంకు నుంచి డ్రా అయ్యాయి. ఇదేమిటని వారిని ప్రశ్నించడంతో పంపించిన డబ్బులు రావాలంటే మరో రూ.25వేలు పంపించాలని సూచించారు. ఇలా రూ.1.18లక్షల వరకు లాగేశారు. మోసపోయినట్టు గుర్తించిన శ్రవన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.



ముందస్తు మొక్కుల జోరు

మేడారంలో రద్దీగా సమ్మక్క, సారలమ్మల గద్దెలు

గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ



క్యూలైన్‌లో..



నిలువెత్తు బంగారం..

మేడారం, ఫిబ్రవరి 8: తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మల సన్నిధి భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా గురువారం తరలివచ్చి వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. మహా జాతర నేపథ్యంలో కుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో కలిసి మేడారం చేరుకున్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తల నీలాలు సమర్పించారు. దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా తల్లుల వద్దకు చేరుకున్నారు. నేరుగా గద్దెలను దర్శించుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం చీర సారెలు సమర్పించుకున్నారు. చల్లంగా చూడాలని కోరుతూ యాట మొక్కులు చెల్లించారు. అనంతరం మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేసి కుటుంబ సమేతంగా విందుభోజనాలు చేశారు. కాగా, సుమారు లక్షకు పైగా భక్తులు మేడారం అమ్మవార్లను దర్శించుకున్నారని కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తెలిపారు. అలాగే జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి కుటుంబ సమేతంగా సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందుతున్న మేడారం సమ్మక్క, సారలమ్మలకు కేరళ రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా తయారు చేయించిన చందన మాలలు, సుగంధ హారాలు, పట్టు వస్త్రాలను మహా జాతర వేడుకలకు బహుకరిస్తానని చెప్పారు. తల్లులకు పట్టు వస్త్రాలు అందజేసే భాగ్యం తనకు కలగడం సంతోషంగా ఉందన్నారు.

స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు చేయాలి

మేడారం మహాజాతరకు తరలివస్తున్న భక్తులు జంపన్నవాగులో ఉన్న స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద పుణ్యస్నానాలు ఆచరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. చింతల్ క్రాస్ రోడ్డు నుంచి రెడ్డిగూడెం కాజ్‌వే వరకు వాగు ప్రమాద స్థాయిలో ఉందన్నారు. భక్తులు మేడారం జంట వంతెనలకు ఇరువైపులా ఏర్పాటు చేసిన స్నానఘట్టాలపై మాత్రమే పుణ్యస్నానాలు ఆచరించాలని అన్నారు.



వనదేవతలను దర్శించుకునేందుకు వస్తున్న శివసత్తులు



జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బస్సులు లేక భక్తుల అవస్థలు

సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి తరలివచ్చిన భక్తులకు సరిపడా బస్సులు లేకపోవడంతో గురువారం అవస్థలు పడ్డారు. మహాజాతరకు ముందుగా మేడారంలో తల్లుల గద్దెలకు మొక్కులు చెల్లించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో తరలివచ్చిన భక్తులు దర్శనాల అనంతరం తిరిగి వెళ్లడానికి బస్సులు లేక మూడు గంటలకు పైగా వేచి చూస్తున్నామని ఆందోళన చెందారు. వేల సంఖ్యలో భక్తులు బస్సు సౌకర్యాలను ఉపయోగించుకుంటున్నారు. ఈ క్రమంలో భక్తులకు సరిపడా బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు నడపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు ఉదయం మేడారం వచ్చి తల్లులను దర్శించుకొని పరిసర ప్రాంతాల్లో విడిది చేస్తున్నారు. సాయంత్రం తిరిగి వెళ్లడానికి గంటల వ్యవధి పడుతోందన్నారు.



కుక్కకు తులాభారం వేస్తున్న దృశ్యం

కుక్కకు నిలువెత్తు బంగారం

హైదరాబాద్‌కు చెందిన పోశాల జ్యోతి-భిక్షపతి దంపతులు తమ పెంపుడు కుక్క లియో నిలువెత్తు బంగారం(బెల్లం)ను వనదేవతలకు సమర్పించారు. కుక్క అనారోగ్యం బారిన పడినప్పుడు మొక్కుకున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే కుక్కతో పాటుగా తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నామన్నారు.



గద్దెల ప్రాంగణంలో బూట్లు వేసుకుని నిర్వరిస్తున్న పోలీసు

గద్దెల ప్రాంగణంలోకి బూట్లతో పోలీసు..

మేడారం వనదేవతల సన్నిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ పోలీసు అధికారి బూట్లతో గురువారం గద్దెల ప్రాంగణంలోకి వెళ్లి భక్తుల దర్శనాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఆ అధికారిని గమనించిన వీఆర్‌ఏ రాంబాబు బయటకు తీసుకువచ్చారు. విధులు నిర్వహిస్తే సంప్రదాయాలు పాటించాల్సిన అవసరం లేదా.. అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. పోలీసు అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

గిరిజన సంప్రదాయంతో జాతర నిర్వహిస్తాం..

అధికారుల సమావేశంలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, ఫిబ్రవరి 8: మేడారం మహాజాతరను గిరిజన సంప్రదాయంతో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని హరిత హోటల్‌లో గురువారం తహసీల్దార్ రవిందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం మేడారం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల మహాజాతరను ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారన్నారు. ఇందులో భాగంగానే భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి భక్తుడు, భక్తురాలు అమ్మవార్లను సులువుగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రత్యేక పారిశుధ్య ఏర్పాట్ల కోసం మేడారం పరిసరాలను 10 సెక్టార్లుగా విభజించి 35 జోన్లుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ఉన్న నాలుగు డంపింగ్ యార్డులు కాకుండా మరో ఆరింటిని నూతనంగా ఏర్పాటు చేశామన్నారు. జాతరలో నిరంతరం పారిశుధ్య పనులు జరిగేలా పనులు చేపడుతామని పేర్కొన్నారు. 4వేల మంది కార్మికులను అందుబాటులో ఉంచామన్నారు. వీరితో పాటుగా ఐటీసీ, సిగరేణి, ఎన్‌టీపీసీ సంస్థల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రాలతోనూ పారిశుధ్య పనులు కొనసాగుతాయని చెప్పారు. జంతు వ్యర్థాలు, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మహా జాతరలో సెప్టిక్ ట్యాంకుల నుంచి వ్యర్థాలను తొలగించడానికి గల్పర్స్ సంఖ్యను పెంచామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో 14 క్లస్టర్లుగా విభజించామన్నారు. 5,532 మరుగుదొడ్లను 279 యునిట్స్‌గా ఒక్కో యునిట్‌కు 20 మరుగుదొడ్లు ఉండేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. భక్తులకు 230 చేతి పంపులను అందుబాటులో ఉంచామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు జాతర రోజుల్లో నిరంతరం తాగునీరు అందించేలా 50 లీటర్ల వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. చలువ పందిళ్లు నిర్మిస్తున్నామని అన్నారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగు లోతట్టు, రద్దీ ప్రాంతాలలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాగులో జాతర సమయానికి మూడు నుంచి నాలుగు ఫీట్ల నీటిమట్టం ఉండేలా ఫిబ్రవరి 14 నుంచి 16వ తేదీ వరకు లక్నవరం సరస్సు నుంచి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. వైద్యశాఖ నుంచి మేడారం పరిసరాల్లో 30 తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంబులెన్స్ అందుబాటులో ఉంటుందన్నారు. ఆర్టీసీ మహిళా సిబ్బందికి టికెట్ కౌంటర్స్ వద్ద ప్రత్యేక వసతి సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జతరకు వచ్చే భక్తులకు 6వేల బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతరలో 14వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారని అన్నారు. ప్రత్యేక ప్రణాళిక ద్వారా ట్రాఫిక్ క్రైమ్ భక్తుల రద్దీ కంట్రోల్ చేయడం జరుగుతుందన్నారు. వనదేవతలను గద్దెలకు తీసుకువచ్చే క్రమంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని రోప్ పార్టీల ద్వారా దేవతల ప్రతిష్ఠకు భంగం కలుగకుండా క్రౌడ్ కంట్రోల్ చేయడానికి ప్రత్యేక టెక్నాలజీ ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. జాతర పరిసరాల్లో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వీఐపీ, వీవీఐపీల దర్శనాల వలన సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని అన్నారు. మహా జాతరకు 23వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ఠ భద్రత ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ బహుదూరం!

(5వ పేజీ తరువాయి)

చర్చించాలన్నా వారు మేడారం నుంచి వరంగల్‌లో వ్యయ ప్రయాసాలకు ఓర్చి రావలసిందే. ప్రధాన జాతర సమయంలో నాలుగు రోజుల పాటు దేవాదాయశాఖ అధికారులు మేడారంలో స్థానికంగా అందుబాటులో ఉన్నా మిగతా రోజులు ఇక్కడ హనుమకొండలో తిష్టవేసి ఉంటారు. హుండీల లెక్కింపు, వాటాల పంపకం తదితర వ్యవహారాలన్నీ హనుమకొండ కేంద్రంగా సాగుతుంటాయి. వీటి పరిశీలన, పర్యవేక్షణకు పూజారులు, పూజారుల సంఘం నాయకులు ప్రతీసారి మేడారం నుంచి వరంగల్‌కు రావలసి వస్తోంది. అదే అన్నిహంగులతో కూడిన ఈవో కార్యాలయాన్ని మేడారంలోని జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేస్తే ఈ ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

వాచ్‌టవర్ కింద..

మేడారంలో ప్రస్తుతం ఈవో కార్యాలయం తల్లుల గద్దెల వద్ద వాచ్‌టవర్ కింద చిన్న ఇరుకు గదిలో ఉంది. ఇందులో ఒక టేబుల్, ఒక కుర్చీ, ఒకరు లేదా ఉద్యోగులు మాత్రమే కూర్చునే వీలున్నది. ఇక్కడ ఈవో ఆఫీసు ఉందన్న విషయంలో చాలా మందికి తెలియదు. ఇంత పెద్ద జాతరకు సంబంధించిన దేవాదాయ శాఖ ఆఫీసు ఇంత చిన్న గదిలో కొనసాగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో ఉండడానికి దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది పెద్దగా ఇష్టపడడం లేదు. వరంగల్ నగరంలో ఉండడానికి అలవాటుపడ్డ అధికారులు, ఉద్యోగులు మేడారంలో విధుల నిర్వహణను శిక్షగా భావిస్తుంటారు. ఇక్కడ డ్యూటీ పడిన ప్రతీ రోజు అప్‌అండ్‌డౌన్ చేస్తుంటారు. మేడారంలో జాతర సందర్భంలో తప్ప మిగతా సమయంలో సిబ్బంది పెద్దగా ఉండరు. ఒకరిద్దరు ఉద్యోగులు తప్ప ఎవరూ కనపడరు. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికపై పూర్తిస్థాయిలో ఈవో ఆఫీసును ఏర్పాటు చేస్తే ఇక్కడే ఉండాల్సి వస్తుందన్న కారణంతో ఇక్కడ కార్యాలయం లేకుండా చాలాకాలంగా అధికారులు అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయ భవనం లేకపోవడంతో ప్రధాన జాతర జరిగే సమయంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో లేదా తాత్కాలికంగా వేసిన గుడారాల్లో ఉంటారు.

ధార్మిక భవన్‌కు మేడారం నిధులు

పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ధార్మిక భవన్ పేరుతో రూ.3కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మించారు. ఈ మూడు కోట్లలో భద్రకాళి దేవస్థానం నుంచి రూ.కోటి, మడికొండలోని మెట్టురామలింగేశ్వరాలయం దేవస్థానం నుంచి రూ.కోటితోపాటు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఆదాయం నుంని మరో రూ.కోటిని వాడుకున్నారు. ఇటీవల వరకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మేడారం ఈవో కార్యాలయాలు హనుమకొండ అద్దె భవనంలో కొనసాగుతుండేవి. ధార్మిక భవనం నిర్మాణమైన తర్వాత ఇందులోకి మారాయి. వాస్తవానికి ఈ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది. కానీ స్థానిక దేవాలయాల నిధులనువాడుకున్నారు. మేడారంలో ఉండాల్సిన ఈవో కార్యాలయాన్ని పట్టించుకోకుండా ఆజాతర నిధులను మాత్రం ఇక్కడ ఎట్లా వినియోగిస్తారని పూజారులు, భక్తులు నిలదీస్తున్నారు. ధార్మిక భవనం నిర్మాణానికి సమ్మక్క సాలరమ్మ జాతర నిధుల నుంచి తీసుకున్న రూ.కోటి నిధులతో మేడారంలోనే ఆధునాతనమైన అన్ని హంగులతో విశాలమైన ఈవో కార్యాలయాన్ని నిర్మించవచ్చు. అదేం పట్టించుకోకుండా ధార్మిక భవనానికి వాడుకొని అందులోనే ఒక భాగంలో మేడారం ఈవో ఆఫీసుకు చోటు కల్పించారు.

ఎప్పటి నుంచే డిమాండ్

వరంగల్‌లోని మేడారం ఈవో కార్యాలయాన్ని మేడారానికి తరలించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. జాతర జరిగిన ప్రతీసారి ఈ డిమాండ్ తెరమీదికి వస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మేడారం ఒక దర్శనీయ స్థలం గానే కాక ప్రముఖ పర్యాటక ప్రాంతంగా కూడా భాసిల్లుతోంది. ఈ దృష్ట్యా అక్కడ భక్తులు బస చేయడానికి శాశ్వత ప్రాతిపదికపై వసతి సౌకర్యాలను కల్పించాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. గద్దెల సమీపంలో పది గదులతో ఒక భవనాన్ని నిర్మించినప్పటికీ నిర్వహణలేక దాని పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. గద్దెల వద్ద దేవాదాయం ఉద్యోగులను నియమించినా వారికి నిలువ నీడ, కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు. అదే పూర్తిస్థాయిలో ఈవో కార్యాలయాన్ని నిర్మించినట్లయితే భక్తుల సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించేందుకు,అవసరమైన ఏర్పాట్లు ఎప్పటికప్పుడు చేయడానికి వీలుంటుందని పూజారులు అభిప్రాయపడుతున్నారు.

మేడారంలో ఈవో ఆఫీసు ఏర్పాటు చేయాలి..

సిద్దబోయిన జగ్గారావు, మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు



మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ప్రాశస్త్యం రోజురోజుకూ పెరుగుతోంది. జాతర ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిని గడిస్తోంది. రెండేళ్లకోసారి ఈ జారతకు కోటి మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఇంత పెద్ద జాతరకు మేడారంలో ఈవో కార్యాలయం లేకపోవడం విడ్డూరం. దీని కార్యాలయాన్ని హనుమకొండలో ఏర్పాటు చేయడం మరీ దారుణం. ప్రతీ చిన్న విషయానికి 130 కి.మీ. దూరంలో ఉన్న ఈ కార్యాలయానికి పూజారులు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పుడు జాతర నిరంతరం జరుగుతోంది. కనుక ఇప్పటికైనా ఈవో కార్యాలయాన్ని మేడారానికి తరలించాలి. అన్ని హంగులతో కూడిన భవనంలో ఏర్పాటు చేయాలి. అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి.

భక్తులకు అసౌకర్యం కలగనీయం

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ● మేడారంలో రాత్రివేళ జాతర పనుల పరిశీలన

మేడారం, ఫిబ్రవరి 8: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగనీయమని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో మంత్రి మేడారం వచ్చారు. వనదేవతల గద్దెల పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్‌లు, చలువ పందిళ్లు, లైటింగ్ పనులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని అడిగి తెలుసుకున్నారు. దర్శనానికి వచ్చిన పలువురు భక్తులతో సీతక్క మాట్లాడారు. ప్రముఖల దర్శనం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్‌ను పరిశీలించారు. స్థానిక పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జిల్లా అధికారులతో మాట్లాడారు. భక్తులు జాతరకు ముందుగానే లక్షలాదిగా తరలివస్తున్నారని, వారికి సదుపాయాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఇప్పుడు కూడా జాతర జరుగుతోందనే విధంగా భక్తులకు ఏ చిన్న అసౌకర్యం కలగనీయవద్దని తెలిపారు. తాగునీరు, పారిశుధ్య చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. మరో వారం రోజుల్లో ఏ పనీ మిగిలి ఉండవద్దన్నారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జాతర జరుగుతున్న విషయాన్ని ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెకర్ శ్రీజ, డీఎంహెచ్‌వో అప్పయ్య, డీపీవో వెంకయ్య, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, డీఎస్పీ రవీందర్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఎండోమెంట్ ఈవో రాజేంద్రం, తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పైసలు కొట్టే... పోస్టు పట్టే!

● పోలీసు బదిలీల్లో పొలిటికల్ చేతివాటం ● ఒక్కో పోస్టుకు రూ.5లక్షల నుంచి రూ.30లక్షలు

వరంగల్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోలీసుల బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారాయా..? వేలం పాటను తలపించేలా సాగిన ఈ కాసుల వ్యవహారంలో పోటాపోటీగా పోస్టులు దక్కించుకున్నారా..? అంటే అవుననే ప్రచారమే జరుగుతోంది. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 29మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో రాజకీయ జోక్యం మితిమీరి పోయిందన్న చర్చ జరుగుతోంది. మంత్రితో పాటు ఒకరిద్దరు మినహా మిగతా లీడర్లు పోలీసు పోస్టింగులను వేలం తరహాలో ఎవరు ఎక్కువ ఇస్తే వారికే సిఫారసు లేఖలు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలాఉంటే బదిలీల్లో జరిగిన ఈ ముడుపుల బాగోతంపై ఇంటిలిజెన్స్ అధికారులు సీఎంకు ఓ నివేదిక కూడా అందించారన్న సమాచారం పోలీసువర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా పోలీసు బదిలీలు జరిగాయి. పదేళ్ల అధికారంలోకి రావటంతో తమకు అనుకూలంగా ఉండేవారిని తమ ప్రాంతాల్లో పోస్టింగులు ఇప్పించుకోవడం ఆనవాయితే. అందులో భాగంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో బుధవారం రాత్రి 29మంది సీఐల బదిలీలు జరగ్గా, వారిలో చాలామంది గురువారం విధుల్లో చేరారు. అయితే ఈ బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారినట్టు ప్రచారం జరుగుతోంది. హనమకొండ జిల్లాలోని నగర శివారులో ఓ పోలీస్‌స్టేషన్ పోస్టును ఏకంగా రూ.30లక్షలు చెల్లించి సొంతం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే నగరంలోని ఓ ఎస్‌హెచ్‌వో పోస్టు రూ.25లక్షల ధర పలికింది. ఈ పోస్టుకే మరో అధికారి రూ.20లక్షల వరకు ఇచ్చేందుకు ముందుకు రాగా, మరో పోలీసు అధికారి రూ.25లక్షలు ఇచ్చేందుకు సిద్ధం కావడంతో సదరు అధికారికే సిఫారసు లేఖ ఇచ్చారని, దీంతో పోస్టింగ్ ఆర్డర్ వచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. అలాగే జనగామ జిల్లాలో ఓ నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్‌కు తక్కువగా రూ.5లక్షలే ధర పలకగా, అదే నియోజకవర్గంలోని మరో పోలీస్‌స్టేషన్‌కు ఏకంగా రూ.20లక్షల ముడుపులు చెల్లించి సీటు సంపాదించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర శివారులోని మరో పోలీసు స్టేషన్ పోస్టుకు కూడా ఏకంగా రూ.15లక్షలు ఫిక్స్ చేసుకోని సిఫార్సు లేఖ ఇవ్వటంతో పోస్టింగ్ ఆర్డర్ వచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇలా ఒక్కొక్క స్టేషన్‌కు ఒక్కో రేటుకు పోస్టింగులు అమ్ముకున్నారనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కృషి చేశారని అనుమానించిన పోలీసు అధికారులకు కూడా తాజా బదిలీల్లో పోస్టింగులు ఇవ్వటం పోలీసువర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. జనగామ జిల్లాలో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న ఓ అధికారికి అదే జిల్లాలో మరో నియోజకవర్గంలో పోస్టింగు ఇవ్వటం చర్చనీయాంశమైంది. ఇక మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మాత్రం ఇలాంటి బేరసారాలు జరగలేదని, ప్రజల వద్ద పైసలు తీసుకోకుండా పని చేయాలనే నిబంధనలతో ఆ ప్రాంతంలో పోలీసులకు పోస్టింగులు ఇచ్చారన్న చర్చ జరుగుతోంది. తన నియోజకవర్గంతో పాటు మరో రెండు మూడు చోట్ల పోస్టింగులకు సిఫార్సు చేసినట్టు సమాచారం. మరో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కూడా పైసల జోలికి వెళ్లకుండా పోస్టింగులకు సిఫారసు లేఖలు ఇచ్చినట్టు తెలుస్తుండగా.. రూ.లక్షలు వెచ్చించి పోస్టింగులు పొందిన కొంతమంది అధికారులు మళ్లీ ఆ సొమ్మును ఎలా సంపాదిస్తారనే చర్చ ప్రజల్లో జరుగుతోంది. పైసలు ఇచ్చి వచ్చిన అధికారులు ప్రజలకు ఎలా న్యాయం చేస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సీఎంకు ఇంటెలిజెన్స్ నివేదిక

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసు పొస్టింగుల్లో రాజకీయ జోక్యం మితిమీరి పోయిందనమ్న వ్యవహారంపై సీఎంవో వర్గాలు దృష్టిసారించాయి. బుధవారం 'ఆంధ్రజ్యోతి' సంచికలో 'పోలీస్ పోస్టింగుల్లో పొలిటికల్ వార్' శీర్షికన కథనం ప్రచురితమైన నేపథ్యంలో తమ సిఫార్సులకు ఎక్కడ బ్రేక్ పడుతుందో అనే ఆందోళనతో కొంతమంది లీడర్లు అధికారులపై ఒత్తిడి తెచ్చి రాత్రికి రాత్రే బదిలీతంతు ముగించారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ బదిలీల్లో భారీగా సొమ్ములు చేతులు మారినట్లుగా ప్రచారం జరగటంతో గురువారం ఇంటెలిజెన్స్ అధికారులు, సిబ్బంది పోస్టింగులపై సమాచారం సేకరించినట్టు తెలిసింది. ఎవరు ఎంత ఇచ్చారు..? ఎక్కడ పారదర్శకంగా పోస్టింగులు ఇచ్చారు..? అనే కోణంలో నిఘా వర్గాలు హోంశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక అందించినట్టు తెలుస్తోంది. మొత్తానికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కమిషనరేట్ పరిధిలో పోలీస్ పోస్టింగుల్లో చేతులు మారిన వైనం రాష్ట్రవ్యాప్త చర్చకు తెరతీసింది.

కాంగ్రెస్‌లో టికెట్ రేస్!

(5వ పేజీ తరువాయి)

ఆసక్తికరంగా మారగా టికెట్ వస్తే చాలు ఉద్యోగాలకు రాజీనామా చేసి ఖద్దరు దుస్తులు ధరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడు స్థానానికి భారీ పోటీ నెలకొంది. మహబూబాబాద్ డీఎస్పీగా పని చేసిన ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన డుంగ్రోత్ నాగరాజునాయక్ కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ భట్టు రమేష్ కాంగ్రెస్ నుంచి మహబూబాబాద్ టికెట్ రేసులో ఉన్నారు. ప్రస్తుతం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎన్పీడీసీఎల్ డీఈగా పని చేస్తున్న మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్ట గ్రామానికి చెందిన ఎట్టి వెంకన్న సైతం కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. అలాగే వరంగల్ ఎంపీ స్థానం కాంగ్రెస్ టికెట్‌కోసం ఉమ్మడి వరంగల్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న హరికోట్ల రవి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన హరికోట్ల రవికి వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సత్సంబంధాలు ఉన్నాయని, వీరి మద్దతుతో ఆయన ఇటీవల ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీని కలిసి వచ్చారని సమాచారం. ఒకవైపు టికెట్ దరఖాస్తు చేసుకుంటేనే తమ గాడ్‌ఫాదర్ల ద్వారా ఆశావహులు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నారు. దీంతో ఎవరికి టికెట్ దక్కుతుందో అనే ఉత్కంఠ నెలకొంది

'గృహజ్యోతి' వివరాలను దగ్గర ఉంచుకోండి..

ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు

హనుమకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి : గృహజ్యోతి పథకం కింద ప్రజాపాలన సందర్భంగా అందచేసిన సమాచారాన్ని ధృవీకరణ కార్యక్రమం తమ సిబ్బంది నిర్వహిస్తున్నారని ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. తమ సిబ్బంది పరిశీలనకు వచ్చినప్పుడు ప్రజాపాలనలో అందచేసిన రశీదును, ఆహార భద్రతాకార్డు (రేషన్‌కార్డు) నెంబర్, ఆధార్ కార్డు నెంబర్‌ను అందుబాటులో ఉంచుకోవలసిందిగా ఆయన కోరారు. ఒకవేళ ఏదైనా కారణంవల్ల తమ సిబ్బంది వచ్చినప్పుడు అందుబాటులో లేకుంటే వివరాలను దగ్గరలోని విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలోగానీ, లేదా విద్యుత్ సహాయక గణాంక అధికారి కార్యాలయంలో గానీ సమర్పించి ధ్రువీకరించుకోవాలని కోరారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- 12 తులాల బంగారం, 53 తులాల వెండి ఆభరణాల స్వాధీనం
- వివరాలను వెల్లడించిన ఏఎస్పీ చెన్నయ్య

మహబూబాబాద్‌రూరల్, ఫిబ్రవరి 8 : మానుకోట జిల్లా కేంద్రంలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి, వారి నుంచి బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ జోగుల చెన్నయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం సత్యనారాయణపురానికి చెందిన పొన్నాల శివశంకర్, భద్రాద్రి కొత్తగూడెం వాసి తిరుపతి, ప్రశాంత్, రమేష్, ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన పందిరి వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అనంతారం చెందిన ఎడ్ల సుమన్, జంపయ్య కేసముద్రం మండలం అమీనాపురానికి చెందిన కన్నా రేణుక, ఎడ్ల సంధ్య ముఠాగా ఏర్పడ్డారు. వారు కొంతకాలంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు పాల్వంచ, హైదరాబాద్, మహబూబాబాద్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడుతుండేవారని తెలిపారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్ వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదంగా వస్తున్న ద్విచక్రవాహనం


దొంగతనం చేసిన వారిని చూపుతున్న చెన్నయ్య

ను తనిఖీ చేసి, బైక్‌కు సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు శివశంకర్, ఎడ్ల సుమన్‌ను అదుపులోకి తీసుకుని, విచారించారు. దీంతో వారు దొంగతనాలకు పాల్పడిన వివరాలను పోలీసులకు వివరించారు. పలుచోట్ల దొంగతనం చేసిన ఐదు కేసుల్లో 12 తులాల బంగారం, 53 తులాల వెండి ఆభరణాలను పోలీసులు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ చెన్నయ్య తెలిపారు. సుమారు వాటి విలువ రూ.5.60 లక్షలు ఉంటుందని తెలిపారు. ఇదే కేసులో కన్నా రేణుక, దాసరి జంపయ్య కూడా ఉన్నారని, వారు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో నిందితులను చాకచక్యంగా వ్యవ హరించి, పట్టుకున్న టౌన్ డీఎస్పీ సత్యనారాయణ, టౌన్ ఇన్‌చార్జి సీఐ రమేష్, మహ బూబాబాద్ ఎస్సైలు రామారావు, పవన్‌ను ఏఎస్పీ అభినందించి, రివార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఏఎస్పీ పండారి చేతన్ ఉన్నారు.

కుమ్మరికుంట్లలో చోరీ

దంతాలపల్లి : మండలంలోని కుమ్మరికుంట్లలో బుధవారం రాత్రి దొంగలు పలుఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డారు. స్థానిక ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన చామకూరి నర్సయ్య ఇంట్లో రాత్రి దొంగలు పడి రూ.8వేల నగదుతో పాటు 5 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. షేక్ చాంద్‌పాష ఇంట్లోకి దొంగతనానికి వెళ్లి, ఏమి దొరకకపోవడంతో వస్తువులను చిందరవందరగా పడేశారు. సంఘటన స్థలంలో క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గ్రామాల్లో అనుమానితులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రమేష్‌బాబు కోరారు.


బీరువాపై వేలు ముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు

'పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8 : మహబూబాబాద్ మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని ఆ గ్రామ వార్డు మెంబర్, సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పాఠశాల ఎదుట గురువారం విద్యార్థినులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీ, వంట గది నిర్మాణాలకు రూ.25 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. నిధులు మంజూరు కాగా, కొత్తవాటిని నిర్మించేందుకు ఉన్న మరుగుదొడ్లను తొలగించి నిర్మాణాలు చేపట్టకపోవడంతో విద్యార్థినులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిధులు మంజూరై నాలుగేళ్లు అయినప్పటికి నిర్మాణాలు చేపట్టకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు మరుగుదొడ్లు నిర్మించాలని వినతిపత్రాలను అందజేసిన స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని డీఈవో, ఎంఈవోలకు తెలియజేయగా వెంటనే స్పందిస్తూ పనులు త్వరలోనే ప్రారంభించిపూర్తిచేయిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించినట్లు చెప్పారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- ఒకరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 8 : జిల్లా కేంద్రంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని, ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఈనెల 5న చోటు చేసుకుంది. గురువారం రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వలకు చెందిన ముప్ప ఉమేష్ సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మానుకోట జిల్లా కేంద్రానికి వచ్చాడు. పనులు ముగించుకుని రాత్రి 8.30 సమయంలో స్వగ్రామమైన కల్వలకు వెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రం శివారు తాళ్లపూసపల్లి రోడ్డు మామిడితోట సమీపంలో ఈనెల 5వ తేదీన గుర్తు తెలియని బైక్ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఉమేష్ తలకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఏంజీఎంకు తరలించారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

దంతాలపల్లి, ఫిబ్రవరి 8 : మండల కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త సేను రాజేష్ తనతండ్రి సేను భిక్షమయ్య జ్ఞాపకార్థకంగా గురువారం పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తనవంతు సమాజసేవలో పేదలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. స్థానికంగా ఉన్న పేదల కోసం సాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అక్కిర వెంకటేశ్వర్లు, మార్త శ్రీనువాస్, సీహెచ్ ఉమేష్, వీరన్న, భిక్షం, నరేష్, మధు, చింటు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చి బాలికపై అత్యాచారయత్నం

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో ఘటన

చెన్నారావుపేట, ఫిబ్రవరి 8: పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థిని బైక్ లిఫ్టు అడగగా, కొద్దిదూరం వెళ్లాక బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఓ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. చెన్నారావుపేట మండలంలోని ఓ గ్రామంలో బాలిక(14) తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి గతంలోనే మృతిచెందగా, తల్లి కూలిపని చేసుకుంటూ చేసుకుంటోంది. ఇదిలాఉండగా, తండ్రి మరణ తర్వాత మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఓ గ్రామానికి చెందిన తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ నిత్యం స్కూల్‌కు వస్తూ వెళ్తోంది. రోజువారిలాగానే గురువారం ఉదయం అమ్మమ్మ ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరింది. రోజూ బస్సు లేదంటే ఆటోలో వెళ్లే బాలిక స్కూల్‌కు ఆలస్యం అవుతుండడంతో ఆటుగా వచ్చే యువకుడి బైక్‌ను లిఫ్టు అడిగింది. దీంతో అతడు లిఫ్టు ఇచ్చాడు. బోజేర్వు గ్రామ సమీపంలోకి రాగానే ఆ యువకుడు బైక్ ఆపి బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక కేకలు వేస్తూ అక్కడి నుంచి తప్పించుకుంది. తర్వాత జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా అత్యాచారయత్నం తమ దృష్టికి వచ్చిందని, ఇంకా కేసు నమోదు చేయలేదని, విచారణ జరిపి త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

'ఆదివాసీలకు ఎంపీ సీట్లు కేటాయించాలి'

గూడూరు, ఫిబ్రవరి 8 : తెలంగాణ పార్లమెంట్ ఎస్టీ రిజర్వుడ్ స్థానాల్లో ఆదివాసీ అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ దాట్ల నాగేశ్వర్‌రావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ డిమాండ్ చేశారు. గూడూరులో ఆదివాసీ సంఘాల సమావేశంలో గురువారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలని ఈనెల 12న గాంధీభవన్ చర్చ వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కల్తీ వీరస్వామి, పడిగె నాగేశ్వర్‌రావు, బొల్లి సారయ్య, కొట్టెం ముఖర్జీ, మంగయ్య, లింగాల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలను పరిష్కరించాలి

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి ఎమ్మెల్యే మురళీనాయక్ విజ్ఞప్తి


షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, మైనార్టీ సంఘాల నేతలు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 8 : రాష్ట్రంలో ముస్లింలు, మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో రాష్ట్రప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సలహాదారుడు షబ్బీర్‌అలీని గురువారం స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్, జిల్లాకు చెందిన మైనార్టీ సంఘాల నేతలు కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం, మైనార్టీల సమస్యలు, వారి అభ్యున్నతికి తీసుకో వాల్సిన చర్యలపై చర్చించారు. మైనార్టీ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాష, ఆల్ అన్సర్ యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహ్మద్ నదీమ్ అలీఖాన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ నజీర్, మస్జిద్ ఉమర్ ఫారూఖ్ కమిటీ సెక్రటరీ జాకీర్, ట్రెజరర్ హకీం, సభ్యులు మహ్మద్ అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

నెల్లికుదురు, ఫిబ్రవరి 8 : పదవీరమణ పొందిన సర్పంచ్‌లకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాధవి ఆధ్వర్యంలో గురువారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీడీవో శేశాద్రి, ఎంపీవో పార్థసారధి, ఎంపీటీసీలు అనిల్, సుభాషిని కళాధర్‌రాజు, రహిమాన్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

- జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు


మాట్లాడుతున్న యలమంచిలి వెంకటేశ్వర్‌రావు

కేసముద్రం, ఫిబ్రవరి 8 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు అన్నారు. కేసముద్రం విలేజిలో గురువారం మండల పార్టీ అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు యాప సీతయ్య, గాంతి వెంకట్‌రెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, వోలం శ్రీనివాస్, రడం వెంకన్న, జమ్ముల గోపాల్‌రెడ్డి, కొండపల్లి మహేందర్‌రెడ్డి, లెంకలపల్లి శ్రీనివాస్, బచ్చు లక్ష్మీనారాయణ, కాటం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను సక్సెస్ చేయండి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 8 : కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా,కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లాప్రధానకార్యదర్శి రేషపల్లి నవీన్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో గురువారం సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. మంద శంకర్, వీరవెల్లి రవి, వరిపెల్లి వెంకన్న, పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, పుచ్చకాయల రమణ, బి.సక్రాం, బి.రాము, రాంబాబు, బాలు, బాలాజీ పాల్గొన్నారు.

చెరువు స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

కేసముద్రం, ఫిబ్రవరి 8 : మండలంలోని అర్పనపల్లి శివారులోని మన్నెకుంట చెరువు స్థలాన్ని క్రషర్ మిల్లువారు ఆక్రమించారని గ్రామానికి చెందిన గంధం భరత్ జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ తాళ్లూరి దామోదర్ గురువారం పరిశీలించారు. చెరువు శిఖం భూమిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, బోరును, కంకర రాళ్లను తొలగించాలని సదరు క్రషర్‌కు నోటీసులు ఇస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట నీటిపారుదల శాఖ ఏఈ సాయితేజ, సర్వేయర్ శ్రవణ్ ఉన్నారు.

అంబేద్కర్, పూలే చూపిన మార్గాలను అనుసరించాలి

- జిల్లా వైద్యాధికారి అంబరీష

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 8 : మహనీయులు డాక్టర్ బీఆర్.అంబేద్కర్, జ్యోతిబాపూలే చూపిన మార్గాలను అనుసరించాలని జిల్లా వైద్యాధికారి అంబరీష అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కేవీపీఎస్ డైరీని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ మార్పు కోసం మహనీయులు ఎంతో కృషి చేశారని చెప్పారు. వారు చూపిన మార్గంలో పయనిస్తూ సమాజంలో వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేవీపీఎస్ డైరీని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య, ప్రజాసంఘాలనాయకులు బెజ్జం ఐలయ్య, రాములు, యాకయ్య, లచ్చయ్య, మహేందర్, యాకూబ్, సురేష్, సంతోష్, ఖాదార్ బాబా, గణేష్‌ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి పాటు పడాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో


ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లెనిన్‌వత్సవ్‌టొప్పో

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 8 : ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పో కోరారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై రూపొందించిన పోస్టర్లను పర్యావరణ పరిరక్షణ విభాగంలో ఆధ్వర్యంలో గురవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత వరకు జాతరలో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలను నిలుపుదల చేస్తూ విక్రయిస్తున్న వారిపై జరిమానాలు విధిస్తూ ప్లాస్టిక్ కవర్లను చెత్తబుట్టలో వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సత్యనారాయణ, హరిప్రసాద్, శ్రీనివాసరావు, సుభాష్ పాల్గొన్నారు.


రోగులకు వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

సాంబయ్యపల్లిలో వైద్యశిబిరం

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

గూడూరు, ఫిబ్రవరి 8 : ప్రతీ ఒక్కరు తమఇంటి పరిసరాలనుపరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంఅండ్ హెచ్‌వో అంబరీష అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన 'మంచంపట్టిన సాంబయపల్లి' అనే కథనానికి స్పందించిన వైద్య సిబ్బంది సాంబయ్యపల్లిలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రైడేను నిర్వహించుకోవాలన్నారు. గ్రామప్రజలు తమఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. నీరునిల్వ ఉన్న చోట కిరోసిన్ చుక్కలు కానీ, ఆయిల్‌బాల్స్ కానీ వేసుకోవాలని చెప్పారు. అనంతరం గ్రామంలో 62 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 26 మంది రక్తనమూనాలు సేకరించారు. అనంతరం వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అయోధ్యపురం వైద్యాధికారి యమున, డాక్టర్ దేవేందర్, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, కెవి.రాజు, పురుషోత్తం, గణేష్, హేమలత, సర్దార్, గౌసియా, శ్రీలత పాల్గొన్నారు.

ఉత్తమ బోధనతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి8 : ఉపాధ్యాయుల ఉత్తమ బోధనతో విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయాలని జిల్లా సంక్షేమ అధికారిణి వరలక్ష్మి అన్నారు. మహబూబాబాద్ మండలం అయోధ్య అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉత్తమ బోధనలతో విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న పోషకాహార మెనూను తనిఖీ చేసి, సిబ్బంది తీరుపై హర్షం వ్యక్తం చేశారు. మండల చైల్డ్‌లైన్ ఆఫీసర్ వాహిని, అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు ఉప్పలయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఇనుగుర్తి, ఫిబ్రవరి 8 : చిన్నముప్పారానికి చెందిన కాలేరు నేతాజీ కుమార్తె ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అదే గ్రామంలోని పీఏసీఎస్ చైర్మన్ గుండా వెంకన్న సోదరుడు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని సైతం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనవెంట నీలం దుర్గేష్, రాకేష్‌రెడ్డి, ఉప్పలయ్య, మహేష్, రాము, అనిల్, గంగాధర్, రమేష్, లక్ష్మీనర్సు, భాస్కర్ ఉన్నారు.

వీఏవోలకు అలవెన్స్‌లను ఇవ్వాలి

కేసముద్రం, ఫిబ్రవరి 8 : ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల పథకంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఐకేపీ గ్రామైక్య సంఘ సహాయకు(వీవోఏ)లకు అలవెన్సులను ఇవ్వాలని వీవోఏలసంఘం జిల్లా నాయకుడు భూక్య నెహ్రూనాయక్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల్లో వివిధ రకాల సర్వేలకు తమను ఉపయోగించుకుంటూ ఎలాంటి భత్యాలను ఇవ్వడం లేదని వాపోయాడు.

ఎస్ఆర్ఎస్‌పీ జలాలను అందించాలి

కేసముద్రం, ఫిబ్రవరి 8 : కేసముద్రం, గూడూరు మండలాల్లోని అర్పనపల్లి, కాట్రపల్లి, తీగలవేణి, నాయకపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లోని చెరువుల్లోకి ఎస్ఆర్ఎస్‌పీ జలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి నాయకుడు కామగోని శ్రవణ్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం రాష్ట్రప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెగ, రాజనపల్లి, అర్పనపల్లి, లక్ష్మీపురం గ్రామాల మీదుగా ఎస్ఆర్ఎస్‌పీ ఉపకాల్వ డీబీఎం-40 ఉందని, ఈ కాల్వలోకి నీరు రాకపోవడంతో ఆయా గ్రామాల చెరువుల్లోకి జలాలు అందడంలేదని తెలిపారు. వరి నాట్లు వేస్తున్న సమయంలో చెరువుల్లో నీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నారని, నీటిని చెరువుల్లోకి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట శేఖర్, సుధాకర్ ఉన్నారు.


స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సేవా కార్యక్రమాలు చేపట్టాలని పత్రాన్ని అందిస్తున్న ఆర్టీసీ డీఎం విశ్వనాథ్

'స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టాలి'

తొర్రూరు, ఫిబ్రవరి 8 : మేడారం జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టాలని తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ బి.విశ్వనాథ్ అన్నారు. గురువారం తొర్రూరులోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కలిసి, ఆయన వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తొర్రూరు డిపో నుంచి 186 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. బస్టాండ్ ఆవరణలో యాత్రకు వెళ్లే ప్రయాణీకుల కోసం స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ, అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం డీఎస్పీ వెంకటేశ్వరబాబును కలిసి ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. దాతల సహకారం అందిస్తామని తెలిపారన్నారు. సూపరింటెండెంట్ తిరుమల్‌రావు, ఎస్టీఐ రజితారెడ్డి తదితరులు ఉన్నారు.

తప్పులను సవరించండి

పెద్దవంగర, ఫిబ్రవరి 8 : ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తులలో పొరపాట్లు ఉంటే జాగ్రత్తగా తప్పులను సవరించాలని మండల ప్రత్యేకాధికారి సయ్యద్ ఖుర్షీద్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఎల్‌బీతండా, బీసీతండా, రాజమాన్‌సింగ్ పలు గ్రామాలలో పర్యటించి ప్రజాపాలన దరఖాస్తుల తప్పిదాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన ద్వారా వచ్చిన 9,523 దరఖాస్తులను గ్రామాల వారీగా బాధ్యతలు వహించిన అధికారులు వాటిల్లోని తప్పిదాలను సవరించి ఆర్హులైన వారికి సంక్షేమ పథకాలు చేజారకుండా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈనెల 10వ తేదీ వరకు ప్రజాపాలన దరఖాస్తులలో ఉన్న తప్పిదాలను సవరించడం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో సత్యానారాయణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 8 : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణమైన ఆరోగ్యం ఉంటుందని గ్రామ స్పెషల్ ఆఫీసర్ తుమ్మ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు గురువారం అమ్మాపురం పాఠశాల, గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, తమ చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణి, హెచ్ఎం మురళీకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ యాకన్న, అంగన్‌వాడీ టీచర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం

తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు

మరిపెడ, ఫిబ్రవరి 8 : నులిపురుగుల నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు పిలుపునిచ్చారు. ఈ నెల 12వ తేదీన నులిపురుగుల దినోత్సవాన్ని పురష్కరించుకొని మరిపెడ మునిసిపల్ ఆఫీస్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలకు పీహెచ్‌సీ డాక్టర్లు అల్బెండజోల్ మాత్రల పంపిణీపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో నర్సింహారావు హాజరై మాట్లాడారు. వన్ ఇయర్ పూర్తి చేసుకున్న వారి నుంచి మొదలుకొని 19ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అందచేస్తున్న అల్బెండజోల్ టాబ్లెట్లను అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పంపిణీ చేయాలని సూచించారు. తహసీల్దార్ సైదులు, మునిసిపల్ కమిషనర్ రాజు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను పర్మినెంట్ చేయాలి

మరిపెడ, ఫిబ్రవరి 8 : అంగన్‌వాడీ టీచర్లను, హెల్పర్లను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కలిపించాలని సంఘం జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం మరిపెడ సంఘ బాధ్యులతో కలిసి ఐసీడీఎస్ సీడీపీవో శిరీషకు సమ్మె నోటీస్ ఇచ్చారు. సంపూర్ణ విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీలకు ఆల్ బెనిఫిట్స్ కలిపించాలన్నారు. ఈనెల 16న ఆల్ ట్రేడ్ యూనియన్స్ నిర్వహిస్తున్న గ్రామీణ బంద్, సమ్మెలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. జ్యోతి, కళమ్మ, ఉమ పాల్గొన్నారు.

'ఆదివాసీ తెగల సమ్మేళనాన్ని జయప్రదం చేయండి'

గంగారం, ఫిబ్రవరి 8 : మేడారంలో ఈనెల 13న జరిగే ఆదివాసీ తెగల సమ్మేళనంను జయప్రదం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి పిలుపునిచ్చారు. గురువారం మండల అధ్యక్షుడు సువర్ణపాక వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడారం సమ్మక్క సార్లమ్మ ఆలయంలో ఆదివాసీ తెగలు హాజరై జాతరలో వారు తీసుకునే నిర్ణయాలపై చర్చ ఉంటుందని అన్నారు. రమేష్, నరేష్, సురేష్, సారయ్య పాల్గొన్నారు.

ఆర్మీ జవానుకు అపూర్వ స్వాగతం


మల్లెల సారయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్మీ జవాను రాజు

కొత్తగూడ, ఫిబ్రవరి 8 : పదవి విరమణ పొంది స్వగ్రామానికి వస్తున్న ఆర్మీ జవానుకు మండల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఎదుళ్లపల్లికి చెందిన చెలమల్ల రాజు ఆర్మీలో 21ఏళ్లుగా33 సైనికుడిగా పలు హోదాలో విధులు నిర్వర్తించాడు. పదవివిరమణ పొంది స్వగ్రామానికి వస్తున్న రాజుకు కుటుంబసభ్యులు, బంధువుల, స్నేహితులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పూలు చల్లుతూ ర్యాలీగా తీసుకువచ్చారు. అంబేద్కర్ విగ్రహానికి, మల్లెల సారయ్య విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం గిరిజన సంక్షేమ క్రీడాపాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జవాను రాజుకు సన్మానం చేశారు.

సమ్మెను జయప్రదం చేయాలి

డోర్నకల్, ఫిబ్రవరి 8 : దేశవ్యాప్త గ్రామీణా భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. డోర్నకల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎం నాయకులు శెట్టి వెంకన్న, బొబ్బ వెంకట్‌రెడ్డి, అశోక్‌కుమార్, వెంకట్రాములు, జేవీఆర్, రాజేందర్, దాసరి మల్లేశం, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బత్తుల శ్రీనివాస్, సుమీర్‌చంద్‌జైన్, భాస్కర్‌ప్రవీన్, సమ్మయ్య, బీఎస్పీ నాయకులు ఐతం ఉపేందర్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కురవి, ఫిబ్రవరి 8 : జీపీల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి చూపాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో అన్నారు. ఈనెల 7 నుంచి 15 వరకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రెండోరోజు గురువారంలింగ్యాతండా(కె) గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం సందర్శించి తనిఖీ చేశారు. ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల ప్రత్యేక అధికారి నర్సింహాస్వామి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో నరస్వతి, సెక్రటరీ శైలజా, మాజీ సర్పంచ్ దారావత్ రవి పాల్గొన్నారు.

చెరువులో మునిగి మత్స్యకారుడు మృతి


ఈరబోయిన స్వామి (ఫైల్)

కొత్తగూడ, ఫిబ్రవరి 8 : చెరువులో మునిగి మత్స్యకారుడు మృతిచెందిన ఘటన పొగుళ్లపల్లిలో గురువారం జరిగింది. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం. పొగుళ్లపల్లికి చెందిన మత్స్యకారుడు ఈరబోయిన స్వామి (63) గురువారం చేపలు పట్టేందుకు గ్రామ శివారులోని చెరువులోకి వెళ్లారు. చెరువులో మునిగి మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సాంబలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై నగేష్ తెలిపారు.

సెలవుదినంగా ప్రకటించాలి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 8 : బంజార గిరిజనుల పోరాటయోధుడు సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథంభవన్‌లో గురువారం సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని బానోత్ వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బానోత్ వెంకన్న, కార్యదర్శిగా భూక్య హరిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రసహాయ కార్యదర్శి భూక్య వీరభద్రం, భూక్య హరి, ఎం.కిషన్, బానోత్ సీతారాం, మాలోతు శాంతికుమార్, సుధాకర్, రెడ్యా, ప్రవీణ్, రోజా, అశ్వినీ, దేవా, గుగులోతురెడ్డి, సాయికుమార్, పూల్‌సింగ్ పాల్గొన్నారు.